క్లుప్తంగా

సన్నిధి గొల్ల, అన్నమయ్య వారసులను కలిసిన మహిళలు



సన్నిధి గొల్ల, అన్నమయ్య వారసులతో మహిళలు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం వెంకన్నపాలెం ప్రాంతానికి చెందిన వాసుదేవ పద అన్నమయ్య సంకీర్తన నామావళి గ్రూప్‌నకు చెందిన మహిళలు సోమవారం తిరుమలలో సన్నిధి గొల్లను, అన్నమయ్య వారసులను కలిశారు. వారి ముందు వేంకటేశ్వరస్వామి నామాలను, అన్నమయ్య కీర్తనలు ఆలపించారు. శ్రీవారి సేవకు గత శుక్రవారం వెళ్లిన మహిళలు అక్కడ స్వామి వారి సేవతో పాటు కోలాట ప్రదర్శన, కీర్తనలు ఆలపించే అవకాశం వీరికి కలిగింది.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు



మాట్లాడుతున్న జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: ప్రభుత్వ పథకాలు అందరికీ అందాలన్న ఆలోచనతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభించారని జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు అన్నారు. 91వ వార్డు పరిధిలోని 480, 481, 482 సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల కష్టాలు తెలిసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అని అన్నారు. గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు వలంటీర్లు ప్రజల అవసరాలు అడిగి తెలసుకుని పరిష్కరించాలని తెలిపారు. పలు సచివాలయాల్లో వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షులు గుణిశెట్టి శ్రీనివాసరావు, అప్పలస్వామి, క్లస్టర్ కన్వీనర్ గేదెల మురళీ కృష్ణ, ఊటపల్లి గోవిందు, బూరెడ్డి గోపి, తదితరులు అవగాహన సదస్సులు నిర్వహించారు.


ద్విచక్ర వాహనంలోకి పాము



పామును బయటకు తీస్తున్న స్థానికులు

సింథియా: సాధారణంగా పాములు ఏ తుప్పల్లోనో, పొలం గట్లపైనో కనిపిస్తుంటాయి. ఈ మధ్యకాలంలో ఇళ్లతో పాటు బాత్‌రూమ్‌లు.. షూల్లో కూడా ప్రత్యక్షమై ప్రజలను కంగారు పెడుతున్నాయి. తాజాగా ఓ ద్విచక్రవాహనంలోకి దూరిన పాము వాహనదారుడిని కంగారు పెట్టింది. జీవీఎంసీ 63వ వార్డు చింతల్లోవలో ఓ వ్యక్తి తన ద్విచక్రవాహనాన్ని బయట వదిలి లోపలికి వెళ్లాడు. ఈ క్రమంలో పాము అతని ద్విచక్రవాహనంలోకి దూరింది. ఇదంతా గమనించిన మహిళ బయటకు వచ్చిన వాహనదారుడికి పాము వాహనంలోకి దూరిన విషయం తెలియజేసింది. వెంటనే పనిముట్ల సాయంతో ద్విచక్రవాహనాన్ని విప్పి పామును పట్టుకున్నారు.

బలరాముడిగా జగన్నాథుడు



అగనంపూడి: శ్రీజగన్నాథుని రథోత్సవం సందర్భంగా అగనంపూడి ఇంద్రజమున హాల్లో స్వామికి విశేష పూజలు నిర్వహించారు. సోమవారం బలరాముడి అవతారంలో జగన్నాథుడు భక్తులకు దర్శనమిచ్చారు. గా మహిళలు విష్ణుపారాయణం, సహస్రనామార్చన చేశారు.

పేదల వైద్యానికి భరోసా

- ములగాడలో ఆరోగ్య కేంద్రం ఏర్పాటుపై హర్షం
- అందుబాటులో స్పెషలిస్ట్ సేవలు



ములగాడలోని డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

మల్కాపురం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజారోగ్యానికి పెద్దపీట వేసిన సంగతి తెలిసిందే. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యమిస్తున్నారు. పేదలు ఎవరూ అనారోగ్య సమస్యలతో బాధపడకూడదనే ఉద్దేశంతో ఆరోగ్యశ్రీ పథకాన్ని మరింత పటిష్టం చేశారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఎందరో బాధితులకు వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందించి అండగా నిలిచారు. పేదలు, సామాన్యుల వైద్యానికి భరోసా ఇస్తూ అందుబాటులోకి వైద్య, ఆరోగ్య సేవలను తీసుకొచ్చారు. ప్రతి వార్డులో డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసి ఉచితంగా వైద్య సేవలందిస్తున్నారు. టీడీపీ హయాంలో ప్రజల ఆరోగ్యాన్ని పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో సుదూర ప్రాంతాలకు రోగులు తరలివెళ్లి వైద్యం చేయించుకోవాల్సి వచ్చింది. పేదలు కనీసం మందులకు నోచుకునే వారు కాదు. ఇటువంటి పరిస్థితుల్లో సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన విప్లవాత్మక కార్యక్రమాలతో ప్రజల చెంతకు వైద్య సేవలు చేరాయి.

58వ వార్డు ప్రజలకు చేరువ

జీవీఎంసీ 58వ వార్డు ములగాడ విలేజ్‌లో కోటి రూపాయల వ్యయంతో గతేడాది డాక్టర్ వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ నిర్మించారు. విశాలమైన ప్రదేశంలో మౌలిక వసతులతో ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేశారు. వార్డులోని ములగాడ, ఎదురవానిపాలెం, గోడేశివానిపాలెం, పిలకవానిపాలెం తదితర ప్రాంతాల నుంచి రోజు పదుల సంఖ్యలో రోగులు ఇక్కడికి వచ్చి వివిధ రకాల వైద్య సేవలు, మందులు ఉచితంగా పొందుతున్నారు. ములగాడ ఆరోగ్య కేంద్రంలో రెగ్యులర్ ఓపీ సేవలతోపాటు స్పెషలిస్ట్ సేవలు కూడా అందుబాటులో ఉన్నాయి. ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సాధారణ వైద్య సేవలు పొందవచ్చు. ప్రతి రోజూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు స్పెషలిస్ట్ ఓపీ సేవలు అందిస్తారు.

స్పెషలిస్ట్ వైద్య సేవల వివరాలు

- ప్రతి సోమవారం: సాధారణ శస్త్రచికిత్స(జనరల్ సర్జన్)
- ప్రతి మంగళవారం: శ్వాస వ్యవస్థ
- ప్రతి బుధవారం: ఎముకలు, కండరాలు
- ప్రతి గురువారం: జనరల్ వైద్యం
- ప్రతి శుక్రవారం: చెవి, ముక్కు, గొంతు
- ప్రతి శనివారం: చర్మ వ్యాధులు, మహిళా సంబంధిత వైద్య నిపుణులు అందుబాటులో ఉంటూ వైద్య సేవలందిస్తారు.

ఆరోగ్య కేంద్రాలు.. మంచి ఆలోచన



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు పేద రోగులకు నాణ్యమైన వైద్య సేవలందిస్తున్నాయి. సీఎం ఆలోచన పేదలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంది. ప్రస్తుత రోజుల్లో వైద్యం బాగా ఖరీదైంది. పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో ఒక్క పైసా ఖర్చు లేకుండా వైద్య సేవలు, మందులు ఉచితంగా అందిస్తున్నారు.

– ఆదారి హరీష్, 58వ వార్డు

అందుబాటులో వైద్య సేవలు



గతంలో వైద్యం కోసం గాజువాక లేదా నగరంలోని వైద్య నిపుణుల వద్దకు వెళ్లాల్సి వచ్చేది. నేడు ఆ పరిస్థితి లేదు. పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ సేవలతోపాటు స్పెషలిస్ట్ వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి. వైద్యులు, స్పెషలిస్ట్ నిపుణులు ప్రతి రోజూ వస్తున్నారు. వారి వద్ద ఉచితంగా వైద్య సేవలు పొందుతున్నాం.

– శ్రీనివాస్‌రాజు, శ్రీహరిపురం

తోపుడు బళ్ల తొలగింపు



తోపుడు బళ్లను తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు, సచివాలయ కార్యదర్శులు

గోపాలపట్నం: గోపాలపట్నం రైల్వే స్టేషన్ నుంచి బంక్ వరకు రోడ్డుపై ఉన్న తోపుడు బళ్లను సోమవారం గోపాలపట్నం ట్రాఫిక్ ఎస్‌ఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తొలగించారు. ఎస్‌ఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ రోడ్లపై తోపుడు బళ్లు ఉండడ వల్ల ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందని తెలిపారు. గతంలో పలు మార్లు హెచ్చరించినా మార్పు రాలేదని అందుకే ఈ చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. నగర కమిషనర్ సీహెచ్ త్రివిక్రమవర్మ ఆదేశాల మేరకు ట్రాఫిక్ సమస్యలు లేకుండా చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఇక మీదట రోడ్లపై తోపుడు బళ్లు పెడితే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. పలు బళ్లను వ్యాన్‌పై జీవీఎంసీ జోన్-8 కార్యాలయానికి తరలించారు.

యుద్ధప్రాతిపదికన గిరిప్రదక్షిణ రోడ్డు నిర్మాణం

- జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ
- రహదారి పనుల పరిశీలన



అల్లూరి జంక్షన్‌లో గిరిప్రదక్షిణ రోడ్డు పనులపై చర్చిస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ, కె.కె.రాజు

సీతమ్మధార: రహదారుల అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తిచేయాలని ఇంజినీరింగ్ అధికారులను జీవీఎంసీ కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ ఆదేశించారు. నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజుతో కలిసి ఆయన సోమవారం లుంబిని పార్క్, హెచ్‌బీ కాలనీ, సీతమ్మధార అల్లూరి సీతారామరాజు జంక్షన్, ఎన్జీవోస్ కాలనీ, మాధవధార, ఆర్ అండ్ బీ జంక్షన్, ఎన్‌ఎస్‌టీఎల్, లక్ష్మీనగర్, సింహాచలం, అడవివరం తదితర ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించారు. సీతమ్మధార అల్లూరి జంక్షన్ నుంచి ఆర్ అండ్ బీ జంక్షన్ మారియట్ హోటల్ వరకు జరుగుతున్న గిరిప్రదక్షిణ రహదారి పునర్నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వరాహ లక్ష్మీనృసింహ స్వామి గిరిప్రదక్షిణకు వచ్చే భక్తులకు అసౌకర్యం కలుగకుండా రోడ్డు పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. గిరిప్రదక్షిణ మార్గంలోని జంక్షన్లను ఆధునికీకరించాలని, 48 బస్ రూట్ విస్తరణ పనులను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి రోడ్ల వెంబడి వ్యర్థాలు, వినియోగంలో లేని వాహనాలు, బడ్డీలు, ఇతర వస్తువులను వెంటనే తొలగించాలని ఆదేశించారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా పనులు..

ఉత్తర నియోజకవర్గంలోని పలు సమస్యలను కమిషనర్ సాయికాంత్ వర్మ దృష్టికి కె.కె.రాజు తీసుకురాగా.. ప్రతి సమస్యను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కె.కె.రాజు మాట్లాడుతూ భక్తులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా జీవీఎంసీ సహకారంతో గిరిప్రదక్షిణ రహదారి పనులు చకచకా జరుగుతున్నాయన్నారు. పర్యటనలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్లు కంపా హనోకు, అల్లు శంకరరావు, జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్.వి.సన్యాసిరావు, టౌన్ ప్లానింగ్ అధికారి అనిత, డీడీహెచ్ దామోదర్‌రావు, కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్‌రాజు, రెయ్యి వెంకటరమణ, కో-ఆప్షన్ సభ్యుడు సేనాపతి అప్పారావు, ఈఈ శ్యాంసన్ రాజు, సత్యనారాయణ రాజు, వేణుగోపాల్, రామ్మోహన్, జోనల్ కమిషనర్లు విజయలక్ష్మి, ఆర్.జి.వి.కృష్ణ, మల్లయ్య నాయుడు, యాత కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లి సుజాత, సీనియర్ నాయకుడు లంకా భాస్కరరావు పాల్గొన్నారు.

'అమ్మ ఒడి'పై అవగాహన



అమ్మ ఒడి అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: జీవీఎంసీ 91వ వార్డు గవర వీధి ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం జగనన్న అమ్మ ఒడి పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు మాట్లాడుతూ అమ్మ ఒడి పథకం వల్ల పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలన్న ఆలోచనతో సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఈ పథకాన్ని ప్రవేశ పెట్టారని చెప్పారు. మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు సంపూర్ణ పౌష్టికాహారం అందిస్తున్నారని పేర్కొన్నారు. గతంలో కంటే అక్షరాస్యత శాతం బాగా పెరిగిందన్నారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో నాడు-నేడు కార్యక్రమం ద్వారా మౌలిక వసతులు కల్పిస్తున్నారని చెప్పారు. విద్యార్థుల సంఖ్యను బట్టి ఉపాధ్యాయలకు పోస్టింగ్ ఇచ్చారని, వారు మరింత నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం నిర్మల, వైఎస్సార్‌సీపీ 91, 92 వార్డుల అధ్యక్షులు గుణిశెట్టి శ్రీనివాసరావు, అప్పలస్వామి, పాఠశాల కో ఆప్షన్ సభ్యుడు దొడ్డి రామచంద్రరావు, మల్ల రామారావు, ఆర్పీలు నాగలక్ష్మి, కనకవల్లి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హెచ్‌పీసీఎల్ గేటు వద్ద కాంట్రాక్టర్ల ఆందోళన

మల్కాపురం: తమకు రావాల్సిన బకాయిలు తక్షణ చెల్లించాలని ఎల్ అండ్ టీ వద్ద సబ్ కాంట్రాక్ట్ పనులు చేస్తున్న పలువురు కాంట్రాక్టర్లు సోమవారం ఆందోళన బాట పట్టారు.హెచ్‌పీసీఎల్ సీ గేటు వద్ద జరిగిన ఆందోళన కార్యక్రమంలో సబ్ కాంట్రాక్టర్లు మాట్లాడుతూ తాము హెచ్‌పీసీఎల్ విస్తరణ పనులు చేపడుతున్న ఎల్ అండ్ టీ వద్ద సబ్ కాంట్రాక్ట్ తీసుకుని రెండేళ్ల నుంచి వివిధ సివిల్,మెకానికల్ పనులు చేస్తున్నామన్నారు. కొంత కాలం నుంచి ఎల్ అండ్ టీ సంస్థ బిల్లులు ఇవ్వడం లేదని ఆరోపించారు. ఈ కారణంగా అప్పులు చేసి తమ వద్ద పని చేస్తున్న కార్మికులకు వేతనాలు చెల్లించుకోవాల్సిన పరిస్థితి తమకు కలుగుతుందన్నారు. పెండింగ్ బిల్లులపై ఎల్ అండ్ టీ అధికారులను ప్రశ్నిస్తే వారు స్పందించడం లేదని ఆవేదన చెందారు.దీనిపై పోలీసులను ఆశ్రయిస్తామని వారు వివరించారు.

గాజువాక విద్యా శాఖ అధికారిగా సునీత

అగనంపూడి: గాజువాక మండలం విద్యా శాఖ అధికారిగా ఎం.సునీత బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సోమవారం ఏడీసీ చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ అభినందనలు తెలిపారు. ఎంఈవో మాట్లాడుతూ పరవాడ, గాజువాక, పెదగంట్యాడ, పెందుర్తి, చినగదిలి మండలాలకు ఎంఈవోగా సేవలు అందించానని, తన విధి నిర్వహణకు సహకరించిన ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులకు ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి ప్రతి మండలానికి ఎంఈవో-1, ఎంఈవో-2లను ఏర్పాటు చేశారన్నారు. జగనన్న విద్యా కానుక, జగనన్న గోరుముద్ద, 10వ తరగతిలో ప్రతిభ చాటిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు వంటి ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారన్నారు. ఉక్కు నిర్వాసిత కాలనీ నాయకులు ఎల్వీ రమణ, దాసరి రాము, కార్మిక నాయకుడు కొల్లిపర రమేష్ పాల్గొన్నారు.

బోధనా నైపుణ్యాలపై వర్క్‌షాప్

సీతంపేట: బోధనా నైపుణ్యాలు, ఫలితాల ఆధారిత విద్యాభ్యాసం, పరిశోధన అంశాల్లో నైపుణ్యాలు మెరుగుపర్చేందుకు బుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో కాలేజీలో నిర్వహిస్తున్న ఐదు రోజుల వర్క్‌షాప్ సోమవారం ప్రారంభమైంది. పలు కళాశాలల అధ్యాపకులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా, రిసోర్స్ పర్సన్లుగా బుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డి.దీపక్ చౌదరి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.ఎస్.కె.చక్రవర్తి వ్యవహరించారు. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్ అధ్యాపకులను అభినందించారు. జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సోమేశ్వరరెడ్డి, డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆర్.శ్రీకాంత్, కన్వీనర్ జె.బాబు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ప్రభుత్వరంగ సంస్థలతోనే ఆర్థికాభివృద్ధి

- ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ప్రభుత్వరంగ పరిశ్రమల వల్లే దేశం ఆర్థికాభివృద్ధి సాధిస్తోందని, అటువంటి పరిశ్రమలను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టడం వల్ల దేశంలో ఆర్థిక వ్యవస్థ కుంటుపడుతోందని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు విమర్శించారు. కమిటీ ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద 865వ రోజు జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్ష శిబిరంలో పలువురు కార్మికులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నేడు దేశంలో ప్రజా సమస్యలను వదిలి తమ రాజకీయ అవసరాల కోసమే పాలక, ప్రతిపక్ష పార్టీలు కుట్ర రాజకీయాలను అవలంబిస్తున్నాయని విమర్శించారు. ప్రజాపోరాటాల ద్వారా జరిగే ఉద్యమాలకు పాలకులు కచ్చితంగా జవాబు ఇచ్చి తీరాలన్నారు. ఉక్కు ఉద్యమాన్ని ప్రజా పోరాటంగా మలిచి పాలకులు స్పందించే విధంగా కార్మికులు పోరాడాలన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన మొండి వైఖరి వీడి పెట్టుబడి పెట్టి విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామని ప్రకటన చేయాలన్నారు. ఈ విషయంలో కార్మికవర్గం అప్రమత్తంగా ఉండి తమ పోరాటాలను మరింత ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ దీక్షా శిబిరంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సంగీత కచేరీ

ఉక్కునగరం: స్థానిక సెక్టార్-1 స్టీల్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన వైఆర్‌కే సంగీత కచేరీ అలరించింది. స్టీల్‌క్లబ్, వైఆర్‌కే అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గాయకులు వై. రవికుమార్, పద్మజ, విజయలక్ష్మి తెలుగు, హిందీ పాటలు పాడి అలరించారు. లాఫ్టర్స్ క్లబ్ రంగారావు బృందం తమ స్కిట్లతో నవ్వించారు. మెజీషియన్ భాషా, శాక్సోఫోన్ సురేష్ తమ ప్రావీణ్యం చాటారు. అంతకు ముందు స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (పర్సనల్), స్టీల్‌క్లబ్ చీఫ్ పేట్రన్ ఎస్.సి. పాండే ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉద్యోగులకు రిక్రియేషన్ కల్పించాల్సిన బాధ్యత యాజమాన్యానిదే అని అతిథులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ పీపీఎం జీఎం డాక్టర్ జి. రమాదేవి, ఏసీఎస్ జీఎం డాక్టర్ వి. చిట్టిబాబు స్టీల్‌క్లబ్ సభ్యుల కోసం నిర్వహిస్తున్న విభిన్న కార్యక్రమాలు ప్రశంసనీయమన్నారు.

ప్రజల కోసమే 'జగనన్న సురక్ష'



కార్యక్రమంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ లావణ్య

మల్కాపురం: నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని 58వ వార్డు కార్పొరేటర్ గులిగుందల లావణ్య అన్నారు. గుల్లలపాలెం వద్ద సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమంపై యువత, మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరంతరం పేదల సంక్షేమం కోసం తపిస్తున్న మహానుబావుడు జగన్ అని వివరించారు. సాంకేతిక కారణాల వల్ల ప్రభుత్వ పథకాలు అందని వారికి కూడా అవకాశం కల్పించడానికి జగనన్న సురక్ష కార్యక్రమం ప్రవేశ పెట్టారన్నారు. కార్యక్రమాన్ని సచివాలయం సిబ్బంది, వార్డు వలంటీర్లు,స్థానిక నాయకులు సమష్టిగా పాల్గొని అర్హులైన వారికి పథకాలు అందే విధంగా చర్యలు తీసుకుంటారన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరి సంక్షేమం కోసం పరితపిస్తున్న జగనన్నకు మీరంతా అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఏఈ సత్యనారాయణ, వార్డు పార్టీ అధ్యక్షుడు కృష్ణ, వ్యవసాయ మార్కెటింగ్ బోర్డు డైరెక్టర్ చుక్క వరలక్ష్మి, సచివాలయాల అడ్మిన్లు రవి కిరణ్, భేగం పాల్గొన్నారు.

మత్తుకు బానిసైతే జీవితాలు చిత్తు



ఎస్‌ఐ అప్పలనాయుడును సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ మురళీ మోహన్



గోపాలపట్నం హైస్కూల్‌లో మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పిస్తున్న సెబ్ సీఐ ప్రసాద్

గోపాలపట్నం: మత్తుకు అలవాటు పడొద్దు...జీవితాలు నాశనం చేసుకోవద్దంటూ గోపాలపట్నం పరిధిలోని పలు పాఠశాలలు, కళాశాలల్లో సోమవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సెబ్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్‌వీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు పిల్లలు దూరంగా ఉండాలన్నారు. తెలిసీ తెలియని వయసులో వీటికి అలవాటు పడితే కుటుంబాలు నాశనమవుతాయన్నారు. తల్లి దండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉపాధ్యాయులకు పిల్లల ప్రవర్తనపై అనుమానం వచ్చినా విద్యార్థుల తల్లి దండ్రులకు సమాచారమిచ్చి కౌన్సెలింగ్ ఇవ్వాలని తెలిపారు. పిల్లలు గంజాయి వంటి వాటికి అలాటు పడితే అనారోగ్యానికి లోనవుతారని వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాల్ మాట్లాడుతూ పాఠశాలల్లో క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. ఉపాధ్యాయులు చెప్పిన విషయాలు భవిష్యత్తుకు పునాదిగా నిలబడతాయని హితవు పలికారు. కార్యక్రమంలో సెబ్ ఎస్‌ఐ శాంతిలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆదిత్య కళాశాలలో..

మాదక ద్రవ్యాలకు యువతే బానిసై బలవుతున్నారని గోపాలపట్నం పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ అప్పలనాయుడు తెలిపారు. ఆదిత్య కళాశాలలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్, డిగ్రీ విద్యార్థి దశ చాలా కీలకమైందని.. ఈ సమయంలో చాలా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆకర్షణకు గురవడం, అలవాట్లకు లోనవడం జరుగుతుందన్నారు. దూమపానం, మద్యపానం వంటి మత్తు పదార్థాల జోలికి వెళ్లవద్దని హెచ్చరించారు. కళాశాల ప్రిన్సిపాల్ మురళీ మోహన్ ఉన్నత స్థాయికి ఎదిగేందుకు ప్రణాళికలు వేసుకోవాల్సిన వయసు అని అన్నారు. ఐక్యరాజ్య సమితి పిలుపు మేరకు న్యాయం కోసం ఆరోగ్యం, ఆరోగ్యం కోసం న్యాయం అనే నినాదాన్ని విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ అప్పలనాయుడును కళాశాల ప్రిన్సిపాల్ ఘనంగా సత్కరించారు.

ఆటో ప్రకాష్ ఆదర్శనీయుడు



ప్రకాష్ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ఆర్చి వద్ద భాస్కరరావు తదితరులు

గోపాలపట్నం: తన ఆటో ద్వారా ప్రజలకు ఉచిత సేవలు అందించిన వ్యక్తిగా ఉల్లూరి ప్రకాష్ ఖ్యాతి గడించాడని జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు అన్నారు. ఇందిరానగర్‌లో ప్రకాష్ గుర్తుగా ఏర్పాటు చేసిన ఆర్చిను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ ఉల్లూరి ప్రకాష్ (ఆటో ప్రకాష్) గర్భిణులు, దివ్యాంగులు, వృద్ధులకు ఉచితంగా సేవలు అందించేవారని తెలిపారు. తండ్రి ఆశయాలను ప్రకాష్ కొడుకు సుందర్ నిలబెడుతున్నాడని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షులు గుణిశెట్టి శ్రీనివాసరావు, అప్పలస్వామి, ఉల్లూరి సుందర్, రమణ మూర్తి, అర్జున్, దాసరి శ్రీను, కాళ్ల వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

సముద్ర జీవుల మనుగడ ప్రధానం



మాట్లాడుతున్న రిజిస్ట్రార్ వి.కృష్ణమోహన్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం మెరైన్ లివింగ్ రిసోర్సెస్ విభాగంలో యూరోపియన్ కమిషన్ ఆధ్వర్యంలో 'సూక్ష్మప్లాస్టిక్, విశ్లేషణ, నియంత్రణ, నిర్వహణ విధానాలు'అంశంపై మూడు రోజుల శిక్షణ తరగతులను రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ ప్రారంభించారు. యూనివర్సిటీకి అందించిన పరిశోధన ప్రాజెక్టులో భాగంగా 15 మందికి ఈ అంశంపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఈ సందర్భంగా విశిష్ట అతిథిగా రెక్టార్ ఆచార్య కె.సమత మాట్లాడుతూ సముద్ర జీవుల మనుగడ ఎంతో ప్రధానమన్నారు. ప్లాస్టిక్ కాలుష్యం కారణంగా తీవ్ర నష్టం జరుగుతోందని, దీనిని నియంత్రించే విధానాలపై అధ్యయనాలు చేయాలని సూచించారు. కార్యక్రమానికి విభాగాధిపతి ఆచార్య పి.జానకీరాం కన్వీనర్‌గా, గౌరవ ఆచార్యులు కె.ఉమాదేవి సమన్వయ కర్తగా వ్యవహరించారు. అనంతరం ఆచార్య ఇ.ఉదయ భాస్కరరెడ్డి, ఆచార్య సాల్మన్ రాజు, ఆచార్య మురళీకృష్ణ కుమార్, రవి ఈశ్వరపు తదితరులు ప్రత్యేక ప్రసంగాలు చేశారు. విభాగ అధ్యాపకులు ప్రాక్టికల్‌గా శిక్షణ ఇచ్చారు.

ఆర్ఎంపీలకు ఉచిత వైద్య పరీక్షలు



పరీక్షల కోసం విచ్చేసిన ఆర్ఎంపీ వైద్యులు

మహారాణిపేట : ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆర్ఎంపీ గ్రామీణ వైద్యులకు ఉచితంగా గుండె పరీక్షలు చేశారు. ఎంవీపీకాలనీలోని మెడికవర్ హాస్పిటల్‌లో నేటి నుంచి నెల రోజుల పాటు సంఘంలో రిజిస్టర్ అయిన వారికి ఈ పరీక్షలు చేయనున్నట్టు హాస్పిటల్‌కు చెందిన మహేష్, వైస్ ప్రెసిడెంట్ ఎస్. పద్మజ తెలిపారు. సమారు రూ. 5 వేలు ఖరీదు చేసే ఈ పరీక్షలను పూర్తి ఉచితంగా చేయనున్నట్టు మెడికవర్ వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా మెడికవర్ యాజమాన్యానికి సంఘం గౌరవ అధ్యక్షుడు మమ్ముల తిరుపతిరావు, వ్యవస్థాపక అధ్యక్షుడు జంగం జోషి ధన్యవాదాలు తెలిపారు. సామాజిక సేవా కార్యకర్త కోన ప్రకాష్, విశాఖ జిల్లా అధ్యక్షుడు ఆకుల శ్రీనివాసరావు, జిల్లా సలహాదారు బాలశంకరం, జోనల్ ప్రచార కార్యదర్శి లోగిస గణేష్, వెంకట్రావు, సూర్యకళ, శివప్రసాద్, గాజువాక అధ్యక్షుడు రాజు, నాగేశ్వరరావు, జయరావు తదితరులు పాల్గొన్నారు.